# నమ్మకానికి మరోవైపు..!

ఆనందరావు " స్వామీజీ'' మహిమాన్విత విశేషాల్ని అత్యుత్సాహంతో చెప్పుకుపోతున్నాడు...!

రాఘవ 'ఊ' కొడుతూ పరిసరాల్ని పరిశీలనగా గమనిస్తున్నాడు... !

నన్నటి రోడ్డు మీద ప్రభుత్వ జీపు కుదుపులు లేకుండా నెమ్మదిగా పరుగుపెడుతోంది.... !

అటూ ఇటూ రోడ్డు పొడవునా, మామిడి, జీడిమామిడి తోటలున్నాయి. వాటి చూట్టూ దట్టంగా ముళ్ళకంచెలు పరుచుకున్నాయి. తోటల్లోంచి, చెట్లమీంచి, రకరకాల పక్షుల ధ్వనులు కర్ణపేయంగా వినిపిస్తున్నాయి.

ఉదయం పదిన్నర! శీతాకాలం ఎండ ఎదుగుతూ ప్రకృతిని, పరిసరాల్ని ప్రభావితం చేస్తోంది. డ్రైవరు జీపును నిదానంగా నడుపుతున్నాడు...అతని ప్రక్కనే డఫేదారు చలమయ్య ఒద్దికగా కూర్చున్నాడు... వెనుకసీట్లో ఆనందరావు, రాఘవ! ఇద్దరూ ఒకే ఊరివాళ్లు.... పలక పట్టిననాటి నుండి పి.జి. చదువుల వరకూ సహాధ్యాయులు. ఆనందరావుని అదృష్టం కృషి అందలం ఎక్కించాయి అంటే ఒప్పుకోడు గాని... అతనిప్పుడు అంచెలు అంచెలుగా ఎదిగి, ఆదాయ వనరుల శాఖలో అత్యున్నత అధికారి పదవిని చేజిక్కించుకున్నాడు. రాఘవ ఒక కళాశాలలో ఆంగ్లోపన్యాసకుడుగానే ఉండిపోయాడు. ఇద్దరూ సమవయస్కులే... ఉద్యోగ విరమణ ఇంకాఅయిదేళ్ళు వుంది. రెండు వందల మైళ్ళ దూరంలో ఉన్నా మిత్రులిద్దరూ తరచూ కలుసుకుంటూ ఉంటారు. ఫోన్లో మాట్లాడుకుంటారు. కుటుంబాల పరంగా సాన్నిహిత్యం, బాంధవ్యం ఉన్నాయి.

ఒక స్నేహితుని ఇంట్లో పెళ్ళి సందర్భంగా నిన్న మిత్రులిద్దరూ కలిశారు. ఉద్యోగాలపరంగా మటామంతి చెప్పుకున్నారు. కష్టం, సుఖం కలబోసుకున్నారు. రాఘవ ఇంట్లో ఒక సమస్యకు పరిష్కారం... పర్యవసానమే ఈ స్వామీజి వద్దకు ప్రయాణం.

వద్దని రాఘవ ఎంత వారించినా ఆనందరావు వినలేదు. అతని అభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా బలవంతంగా చనువుగా జీపెక్కించాడు.

కాకినాడలో బయలుదేరిన గంటన్నరకి జీపు మలుపుతిరిగి... ఈ చిన్నరోడ్డు ఎక్కింది. ఇక్కడికి మైలున్నర దూరంలోనే ఈ స్వామీజీ ఆశ్రమం ఉందట.!

ఆనందరావు వాక్ప్రవాహం పరవళ్ళు తొక్కుతోంది.!

" భగవాన్ మౌన పరిపూర్ణమునగపాకస్వామి....'' ఈయన్నే మునగపాకగాడ్''

అంటారు. ఈయన ఎక్కడనుంచో వచ్చి స్థిరపడిన ఈ ప్రాంతం 'మునగపాక' అనే ఊరు అన్నమాట... దేశంలో చాలామంది స్వామీజీలు ఉన్నారు. పీఠాధిపతులున్నారు, ఆశ్రమాలున్నాయి, ఆధ్యాత్మిక పీఠాలున్నాయి. వారివారి గొప్ప అమూల్యమైన ప్రవచనాలు, ప్రబోధాలు వింటూ ఉంటాం ఎన్నో మహిమలు,మహత్తులు మనం చూస్తూ ఉంటాం, ఎంతమంది ఉన్నా ఈయన ప్రత్యేకతే వేరు....

స్వామీజీ సదా మౌనంగా ఉంటారు, చెరగని చిరునవ్వుతో భక్తుల విన్నపాలువింటారు. మన మనసులోని బాధ లేదా సమస్య ఆయనకి ముందే తెలిసిపోతుంది. దాన్ని ఆయన వెంటనే పరిష్కరించాలనుకుంటే హఠాత్తుగా ఆసనం మీంచి లేస్తారు. ఆ భక్తుడి వద్దకు వెళ్ళి... నెత్తిమీద రెండుసార్లు చేత్తో చరుస్తారు... చెవిలో చిన్నగా గుసగుసలాడుతారు... అలా జరిగిందో ఆ భక్తుడి జన్మ తరించినట్టే ! అతని కర్మలన్నీ పరిపక్వమయినట్టే ! అతని జీవితంలో గొప్ప మార్పు సంభవిస్తుంది ! అనుకున్న వన్నీ జరుగుతాయి! ఎలాంటి సమస్యలైనా దూదిపింజెల్లా ఎగిరిపోతాయి.

ఆనందరావు ఒక అలౌకికావస్థలో స్వామీజీ మహత్తు వివరిస్తున్నాడు. రాఘవ విస్మయంగా వింటున్నాడు.!

"ఆయన మహిమలు ఎన్నని చెప్పగలం? రెండు కాళ్ళూ చచ్చుబడిన ఒక వ్యక్తి నిటారుగా నడవడం నాకు తెలుసు...విదేశాల్లో వైద్యం చేయించుకున్నా నయం కాని ఒక పారిశ్రామికవేత్త స్వామీజీ ఆశీస్సులతో సంపూర్ణ ఆరోగ్యవంతుడైనాడు... ఇప్పుడు పార్లమెంటులో అడుగుపెట్టి మంత్రిగా రాజ్యమేలుతున్నాడు... డాక్టర్లు ధ్రువపరచిన ఒక కేన్సరు రోగి శవం ... భగవాన్ చేయిపడి లేచి కూర్చోవడం వింతల్లో వింత! ఆయన్ని విమర్శించే వారందరికీ ఒక చిరునవ్వుతోనే సమాధానం చెబుతారు. ఎందరో, ఆయనలో ఏ మహత్తూలేదనీ నిరూపించాలని విఫల ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నాల వల్ల స్వామీజీ పేరు మరింతగా మారు మ్రోగిపోయింది. ఈయన వల్ల ఈజిల్లాకే గొప్ప పేరు వచ్చింది. నీళ్ళు, రోడ్లు, రవాణా సౌకర్యాలతో ఈ ప్రాంతం విస్తృతంగా అభివృద్ధి చెందింది. రాజకీయ నాయకులు, మంత్రులు, గవర్నర్లు... ఒకరేమిటి ఎంతోమంది మేధావులు 'స్వామీజీ'ని దైవాంశ సంభూతుడుగా ఎప్పుడో ఒకప్పుడు దర్శించుకుంటూనే ఉంటారు"

ఆనందరావు ఒక నిమిషం ఆగి విషయం వింటున్నాడా లేదా అన్నట్టు మిత్రుని ముఖంలోకి చూశాడు. రాఘవ నవ్వుతూ తలపంకించాడు.

" నా వరకూ నేను రెండు నెలలకొకసారయినా వెళ్ళి స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటాను, భగవాన్ ఒకే ఒక్కసారి నా నెత్తిమీద చేత్తో చరిచారు. నా చెవిలో ఏదో గుసగుసలాడారు... అంతే! నా ఒళ్ళు జలదరించినట్లయింది. మనసులో ఏదో పులకరింతలాంటి భావన. ఆ తరువాత నేను జీవితంలో వెనక్కి తిరిగి చూడలేదు. నేను

పట్టిందల్లా బంగారమయింది... ఎన్నో మెట్లు ఎక్కాను.. పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దాను.. ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు, ప్రమోషన్లు... నేను, మా ఆవిడా, కుటుంబం అంతా, ఇంత ఆనందంగా జీవించడానికి కారణం... స్వామీజిని మేము మనసారా నమ్ముకోవడమే! అందుకే భగవాన్ మాకూ మా వంశానికి కుటుంబానికి ఆరాధ్యదైవం. నిజంగా ఆయన మానవమాత్రుడు కాదు, మనిషి రూపంలో ఉన్న దేవుడు.... ముమ్మాటికీ దేవుడే!''

ఆనందరావు ముఖంలో గొప్ప వెలుగు తన్మయుత్వం! అవును... ఆనందరావు ఇంటి హాల్లో స్వామీజి నిలువెత్తు చిత్రపటం నిత్యారాధనతో వెలుగుతూ ఉంటుంది. గది గదిలోనూ ఆయన ఫోటోలుంటాయి. వాడి ఇంట్లోనే కాదు... బంధువుల ఇళ్ళలోనూ, కొంతమంది స్నేహితుల గృహాల్లోను మునగపాక స్వామీజీకి పూజలు జరుపుతూంటారు. ఎటొచ్చి 'భగవాన్' గురించి ఎలాంటి అవగాహన లేనివాడు రాఘవ ఒక్కడే!

స్వామీజీ గురించి ఇన్ని మాటలు, ఇంత నిర్దుష్టంగా చెప్పింది, ఎవరో సాదాసీదా వ్యక్తికాదు... ఒక ప్రభుత్వ ఉన్నత ఉద్యోగి, విద్యావంతుడు, సంఘంలో పేరు ప్రఖ్యాతులు, హోదా, దర్పం ఉన్నవాడు, అంతకు మించి తనకు ఆత్మీయమిత్రుడు!

రాఘవలో ఇంతకుముందు లేని ఒక అవగాహన... ఒక ఆలోచన!

జీపు ఆశ్రమం గేటు ముందు ఆగింది. పెద్ద గేటు... చుట్టూ వలయాకారంలో ప్రహారీ గోడ ఉంది. ఆశ్రమం గేటుకు అటూ ఇటూ వివిధ రకాల వాహనాలు బారులు తీరి ఉన్నాయి. డ్రైవరు చోటు చూసుకుని జీపును ఒకచోట నిలబెట్టాడు. జీపు దిగి గేటు లోపల్నుంచి, ఆశ్రమ ఆవరణలోకి నడిచారు. ఆనందరావు ముందు దారితీశాడు. డ్రైవరు, డఫేదారు చలమయ్య స్వామీజీని గతంలో చాలాసార్లు చూశామంటూ బయటే ఉండిపోయారు. ఆవరణ లోపల అంతటా ప్రశాంతమైన వాతావరణం... అందంగా నిర్మించిన చిన్న చిన్న పర్ణశాలల్లాంటి కుటీరాలు... అక్కడక్కడా ఎత్తైన ఫల వృక్షాలు, పరిమళిస్తోన్న వివిధ జాతుల పూలమొక్కలు ..... ఆశ్రమం అన్ని మూలలా గూళ్ళు కట్టుకుని స్వేచ్ఛగా ఎగురుతోన్న తెల్లటి పావురాలు, ఎక్కడినుంచో మైకులో సన్నగా వినబడుతూన్న భక్తుల సమారాధన!

స్వామీజీ దర్శనమిచ్చే భవనానికి మూడు క్యూలు నెమ్మదిగా కదులుతున్నాయి ! మొదటి 'క్యూ' పొడవుగా చాంతాడులా ఉంది. అది ధర్మదర్శనం క్యూ అట... ! అందరి చేతుల్లో పూలు పళ్ళు ఉన్నాయి. రెండవ క్యూ భక్తులు, పదిరూపాయలు మొదలు, వెయ్యి వరకూ హుండీలో వేసేవాళ్ళట... మూడవ 'క్యూ' వెయ్యి మొదలు, పదివేలు... ఆపైన ఎంతైనా సమర్పించకునే విశిష్ఠ భక్తుల కోసమట! మూడవ 'క్యూ' చాలా చిన్నదిగా ఉంది.

ఆనందరావు అలవోకగా జేబ్ బ్యాగులోంచి ఏభై రూపాయల కట్ట ఒకటి తీశాడు. క్యూ మొదట్లో భక్తుల చెల్లింపులకు రసీదు రాస్తూన్న కార్యకర్త చేతిలో పెట్టాడు. అతను చిరునవ్వుతో పరిచయమున్న వాడిలా ఆనందరావుకు రసీదు అందించాడు. మిత్రులిద్దరూ ముందుకు

నడిచారు. ఆశ్రమానికి ఎప్పుడొచ్చినా అయిదువేలకి తక్కువగా చందా ఇవ్వడం జరగలేదట. ఆనందరావు అదేదో సాధారణ విషయం అన్నట్టుగా చెబుతూంటే రాఘవ అబ్బురంగా విన్నాడు.

మూడవ క్యూ ముందుకు సాగి, రెండు మలుపులు తిరిగి తిన్నగా స్వామీజీ ఉన్న విశాలమైన హాల్లోకి వెళ్ళింది. ఆ హాలు మధ్యలో చుట్టూ భక్త పరివారంతో.. అఖండంగా వెలిగిపోతూ.. " భగవాన్ మౌన పరిపూర్ణ మునగపాకస్వామి" దర్శనం అయింది.

ఆనందరావు అల్లంత దూరం నుంచే తల ఒంచి రెండు చేతులూ జోడించాడు. చెంపలు వేసుకున్నాడు.... రాఘవ ఆశ్చర్యంగా కళ్ళు విప్పార్చుకుని చూశాడు.

స్వామీజీకి డెబ్భై ఏళ్ళు పైనే ఉండొచ్చు. దబ్బపండు ఛాయ... ముక్కుసూటిగా, కళ్ళు తీక్షణంగా ఉన్నాయి. వయసుభారం వల్లనేమో బక్కపలచని శరీరం, వడలి వ్రేలాడుతోంది. మెడలో రుద్రాక్షమాలలు... భుజంమీద జరీ అంచు ధవళవర్ణపు శాలువా... బవిరిగడ్డం.. నెత్తిమీద చుట్టచుట్టుకున్న జుట్టు.. నుదుట త్రిచూర్ణంతో తీర్చిదిద్దిన బొట్టు... పొడవుగా ఉన్న హాలు మధ్య చదరంగా పరుచుకున్న ముఖమల్ పరుపుమీద వెండి సింహాసనం లాంటి కుర్చీలో స్వామీజీ సుఖాసీనులై ఉన్నారు. అర్ధనిమీలిత నేత్రాలతో తన ముందు మోకరిల్లిన భక్త జనావళికి అభయహస్తంతో ఆశీస్సులందిస్తున్నారు.... అంతటా నిశ్శబ్దం... ప్రశాంతత... ఎవరూ పెదవి విప్పటం లేదు...

అన్ని వైపులా కాషాయ దుస్తుల్లో ... సుశిక్షితులైన సైనికుల్లా ఆశ్రమ కార్యకర్తలు సంచరిస్తున్నారు!

ఆనందరావు, రాఘవ స్వామీజీకి కాస్త దూరంలో చోటు చూసుకుని కూర్చున్నారు.!

"ఒరేయ్ రాఘవా! స్వామీజీని ప్రత్యక్షంగా చూస్తున్నావు కాబట్టి... నీ మనసులోని సమస్య ఏమిటో నివేదించుకో! ఆయనకు నీ సమస్య వినబడుతుంది!" ఆనందరావు సూచనగా అన్నాడు.

రాఘవ స్వామీజీని చూస్తూ ధ్యైదీభావంతో తన భార్య అనారోగ్యాన్ని మననం చేసుకున్నాడు.

రాఘవ భార్య సుమిత్ర... రెండేళ్ళ క్రితం మొక్కలకు నీళ్ళు పోస్తూ పోర్టికోలో పిట్టగోడ మీంచి కాలుజారి క్రింద మెట్ల మీద పడిపోయింది అప్పట్నుంచీ ఆవిడ పైకి లేవలేకపోయింది. లేచి నడవలేకపోయింది. డాక్టర్లు వెన్నెముకకు గట్టి దెబ్బతగిలిందన్నారు. నడుము వద్ద పట్టు కోల్పోయిందన్నారు. ఆపరేషను జరిగింది. కాళ్ళు కదిపి నడవడం కష్టమని తేల్చి చెప్పేశారు. ఎన్నో రకాల పరీక్షలు... చికిత్సలు జరిగాయి. ఫలితం శూన్యం ! ఎన్నో ఊళ్ళు తిరిగారు.. ఆయుర్వేదం, హోమియో, యునానీ, ఆక్యుపంచర్ లాంటి వైద్యాలన్నీ ప్రయత్నించారు. ఏమీ మార్పులేదు. ఆవిడ జీవితం మంచానికే పరిమితమైపోయింది. ఒక పనిమనిషి నిత్యం ఆమెను అంటిపెట్టుకుని ఉంటుంది.

రాఘవకు భార్య గురించి అంతులేని బెంగ... బాధ... నిస్సహాయత! చివరికి

అతను ఒక నైరాశ్యంలో మునిగిపోయాడు. " ఈ స్వామీజీ దయ వల్ల తన భార్యకు నయమవుతుందా? మళ్ళీ మామూలుగా నడవగలుగుతుందా? అలా జరిగితే ఎంత అదృష్టం? ఎంత ఆనందం? " రాఘవ శిరసు వంచి కళ్ళు మూసుకున్నాడు... ఏదో ఉద్వేగంలో స్వామీజీని మనసా స్మరిస్తూ భార్య అనారోగ్యాన్ని దూరం చేయమని కోరుకున్నాడు.

విశిష్ట భక్తులు ఒక్కొక్కరే వెళ్ళి వినమ్రంగా " భగవాన్ మునగకపాకస్వామి" ముందు మోకరిల్లి సాష్టాంగపడి ప్రణామాలు చేస్తున్నారు. ఆయన పాదాల్ని కళ్ళకద్దుకుంటున్నారు. ఆనందరావు, రాఘవలకు అయిదు నిముషాల్లో స్వామీజీ ముందు మోకరిల్లటానికి అవకాశం వస్తుందనగా... ఆయన హఠాత్తుగా ఆసనం మీంచి లేచారు...

భక్తుల మధ్య, ఇనుప కమ్మీల వారగా... ఎర్రటి తివాచీ పరచిన దారిలో అడుగులో అడుగు వేస్తున్నట్టు అతి జాగ్రత్తగా నడుస్తున్నారు!

భక్తుల్లో వింత చైతన్యం.. వెల్లువెత్తే ఆనందం... నడుస్తున్న దేవుడ్ని కనులారా తిలకిస్తున్న తాదాత్మ్యం...

నిశ్శబ్ద స్వరంలో ... "' ఓం! భగవాన్ మౌన పరిపూర్ణ స్వామియేనమ:" అంటూ సామూహికంగా పెదవులు కదుపుతున్నారు.

స్వామీజీ నడుస్తూ నడుస్తూ అభయ హస్తాన్ని ప్రదర్శిస్తూ ఒక మలుపు వద్ద ఆగిపోయారు. యాదృచ్ఛికం అన్నట్టుగా ఒక మూల కూర్చున్న ఓ మహిళా భక్తురాలి నెత్తిమీద రెండుసార్లు చేత్తో చరిచారు. అంతే ఆ భక్తురాలు ఉలిక్కి పడి కళ్ళు తెరచి చటుక్కున లేచింది.. నిలువునా చలించిపోయింది ! " భగవాన్ ! నా మీద దయ చూపించారా! ధన్యురాలిని స్వామీ... నేనెంతో అదృష్టవంతురాలిని తండ్రీ!" అమాంతం ఆయన పాదాల మీద పడిపోయింది.... చుట్టూ ఉన్న వందలాది భక్తులు " అయ్యో! ఆ అదృష్టం మాకు దక్కలేదే " అన్నట్టుగా ఈర్ష్యగా, నిరాశగా స్వామీజిని చూస్తూండిపోయారు.!

ఆ దృశ్యాన్ని చూపిస్తూ ఆనందరావు, రాఘవ భుజం మీద చేయివేశాడు. " చూశావా భగవాన్ అనుగ్రహం... ఎప్పుడు ఎవరిమీద వర్షిస్తుందో చెప్పలేం.. అలా నెత్తిమీద చరచి ఆశీర్వదిస్తే... వాళ్ళు నిజంగా పుణ్యాత్ములే.. వాళ్ళకన్నీ శుభాలే జరుగుతాయి.

రాఘవకి మిత్రుడి మాటలు ఆశావహంగా అనిపించాయి" స్వామీజీ అనుగ్రహం తన మీద కూడా కలుగుతుందా? భార్య సుమిత్ర అంగవైకల్యం నుంచి విముక్తురాలవుతుందా? " ఒక సందేహం.... ఒక సంతోషం... భగవాన్ నెమ్మదిగా ముందుకు నడుస్తూ.... మరో మలుపు తిరిగారు. భక్తుల మధ్య చిదానంద రూపంతో అడుగులు వేస్తూ మళ్ళీ ఒకచోట నిలబడిపోయారు. ఆ వరుసలో చివరగా కూర్చున్న ఎత్తైన యువభక్తుడి నెత్తిమీద రెండుసార్లు చేత్తో చరిచారు. ఆ యువభక్తుడు మరుక్షణం తలెత్తిచూశాడు. ముఖం ఇంత చేసుకున్నాడు. చివ్వున లేచాడు... స్వామీజీని పైనుంచి క్రిందిదాక ఓసారి

పరిశీలనగా చూశాడు. చేయి సాచిపెట్టి సాక్షాత్తు భగవాన్ మౌనపరిపూర్ణ మునగపాక స్వామీజిని "ఛెళ్ ఛెళ్" మంటూ రెండు సార్లు చెంపమీద కొట్టాడు.!

ఆ దెబ్బలకు స్వామీజీకి ఏమయిందో విద్యుద్ఘాతం తగిలినట్టు ... పెనుతుఫాను తాకిడికి పురాతన వృద్ధ వృక్షం విలవిలలాడుతూ ఒరిగిపోయినట్లు దబ్బుమని నేలమీద పడిపోయారు.

ఎంత ఘోరం ? ఎంత దుర్మార్గం? ఎంత దారుణం? ఎంత సాహసం? పాపాత్మకమైన ...హృదయవికారమైన... ఆ దృశ్యాన్ని వీక్షిస్తూ హాలు పొడవునా కొలువుతీరిన భక్తజనం... పెరారెత్తిన కెరటాల్లా పెద్దపెట్టున హాహాకారాలు చేశారు.... కేకలు పెట్టారు!

అపరభగవత్ అవతారాన్ని... పిపీలికాది పర్యంతం... బ్రహ్మాండం వరకూ తన ప్రేమతత్వంతో... మహిమాన్విత విశేషాలతో.. సమ్మోహనపరిచే మౌనపరిపూర్ణ మునగపాక కలియుగ దేవుణ్ణి ఒక అనామకుడు చెంపదెబ్బలు కొట్టడమా? ఎవరువాడు? తీవ్రవాదా? ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ సభ్యుడా? నాస్తిక హేతువాద నాయకుడా? వాడు ఎవడైనా... వాడి పని పట్టాల్సిందే!

అప్పటికే రక్షక దళసభ్యులు ఆగంతక భక్తుడ్ని వలయంలా చుట్టుముట్టి కదలకుండా పట్టుకుని పెడరెక్కలు విరిచి కట్టేశారు! ఆనందరావు, రాఘవ ఆ సంఘటన చూస్తూ దిగ్భ్రమగా ఉండిపోయారు!

ఆశ్రమ కార్యకర్తలు కొందరు చుట్టూ మూగి ఉన్న భక్తుల్ని తప్పించి... స్వామీజీ వద్ద వాలిపోయారు. నేలమీద అచేతనంగా పడిఉన్న భగవాన్ ఉలకడంలేదు... పలకడంలేదు... ఊపిరి కూడా అందడం లేదన్నట్టుగా ఎగశ్వాస... దిగశ్వాస తీస్తున్నారు.

అదిగో అప్పుడు ఒక భక్త శిఖామణి ఆ గుంపులోంచి ముందుకొచ్చాడు ! ఆయన వైద్యరంగంలో విదేశాల్లో అయిదు డిగ్రీలు అందిపుచ్చుకున్నవాడు... భగవాన్ నాడిని పరీక్షించాడు.. ఛాతీ మీద ఎడమవైపు బాగా రుద్దాడు. కృత్రిమ శ్వాస అందించే ప్రయత్నం చేశాడు. మరుక్షణం పెదవి విరిచాడు.... పరిస్థితి ప్రమాదకరం అన్నాడు. అత్యవసర చికిత్స అవసరమన్నాడు... వెంటనే వైద్య వాహనాన్ని రప్పించమన్నాడు.... అన్నట్టుగా వాహనం క్షణాల్లో రొద చేస్తూ వచ్చింది. భగవాన్ మౌన పరిపూర్ణ స్వామీజీని గురుశిష్యులు మోసుకుపోయి వాహనంలోకి ఎక్కించారు.

వాహనం ఆసుపత్రి అత్యవసర విభాగం వైపు దూసుపోయింది! స్వామీజీకి ఏమయ్యింది? ఏ జరిగింది? ఎంత అపచారం? ఎంత అన్యాయం? సాక్షాత్తు భగవాన్ మీదే చేయి చేసుకున్నాడంటే వాడు నిజంగా తీవ్రవాదే... వాడ్ని క్షమించకూడదు.... వాడి అంతు చూడాలి.... అంతం చేయాలి!

భక్త జనావళి ఆవేశాలు, ఆక్రోశాలు.. కట్టలు తెంచుకున్న భావోద్వేగాలు! అందరితో పాటు ఆగంత భక్తుడ్ని చూడటానికి ఆనందరావు, రాఘవ ముందుకు తోసుకొచ్చారు.

అప్పటికే గుంపు మధ్య నిలబడ్డ ఆగంతకుడి మీద రక్షకదళం వాళ్ళ ముష్టిఘాతాల

ప్రయోగం జరుగుతోంది... కార్యకర్తల ఆగ్రహజ్వాలలు ఎగిసిపడుతున్నాయి. "ఎవరు నువ్వు? ఎక్కడ్నుంచి వచ్చావు? నీ వెనుక ఎవరు ఉన్నారు? చెప్పకపోయావో నిన్ను పోలీసులకి అప్పగించడం కాదు... నిన్నక్కడే...

దెబ్బమీద దెబ్బ పడుతోంద.... ఆగంతకుడు పెదవి విప్పడంలేదు..

"ఆగండి బావూ ! ఆగండి! మీకు దణ్ణం ఎడతా..."

ధర్మదర్శనం భక్తుల్లోంచి ఓ వృద్ధ స్త్రీ పడుతూ లేస్తూ... పెడబొబ్బలు పెడుతూ పరుగెత్తుతూ వచ్చింది... హాల్లోని అందరి భక్తుల కళ్ళూ ఆ వృద్ధురాలి వైపు మళ్ళాయి.

" అడ్ని కొట్టి సంపెయ్యకండి బావూ.. అడెక్కడ తప్పిపోనాడోనని గుండెలు బాదుకుంటా తిరగతన్నాను.. అడ్ని కొట్టకండి నాయినలారా ! కొట్టకండి... అడు నోరులేనోడు.. మాట్టాడనేడు... మీరేం ఏటడగతన్నరో ఆడికి ఇనబడదు... ఆడు సెవిటోడు.. మీరేల కొడతన్నారో... మీరేల తిడతన్నారో.. ఆడికి ఎరుకనేదు. ఆడు మెదడులేనోడు... ఎర్రిమాలోకం బావూ! ఆడు నాకొడుకే నాయినలారా ! మునగపాక సామికి సూపిత్తే ముదిరిపోయిన పిచ్చి నయమవుద్దని ఎవులో సెబితే కొండంత ఆసెట్టుకుని ఎంటబెట్టుకొచ్చాను.. ఆడెంత తప్పు సేసినాడో... ఎర్రినాకొడుకు? గోరంవే! బగమంతుడు నాటి మునగపాకసామికి ముప్పూటలా దణ్ణం ఎట్టుకోవాల... ఆ సామిని సెంపదెబ్బలు కొట్టడవంటే... గోరంకాక ఏటవుద్ది? బావూ.. ఆడికిగేనంలేదు... బుద్దినేదు... మన్లాటి మడిసి కాదు బావూ.. కాదు! ఆడ్ని ఒగ్గేయండి... తండ్రీ! ఒగ్గేయండి!"

ఆ స్త్రీ లబోదిబోమని పిచ్చికొడుకుని పట్టుకుని రోదిస్తోంది... వాడు తల గుండ్రంగా తిప్పుతూ చొంగకారుస్తూ... వెర్రి చూపులు చూస్తున్నాడు... అక్కడే ఉన్న ఆనందరావు, రాఘవ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు అయోమయంగా!

స్వామీజిని చెంపదెబ్బలు కొట్టింది ఒక మతిలేనివాడు... పిచ్చివాడు.. ఒక మానసిక వికలాంగుడు! వాడు చేయి చేసుకుంటే భగవాన్ మౌనపరిపూర్ణ స్వామీజీ కుప్పకూలి నట్టుగా వడిపోవడం... మానవ మాత్రునిలా స్పృహ తప్పిపోవడం.. ప్రమాదం అంచున.... ప్రాణాపాయంలో కొట్టుకోవడం ఏవిటిది? స్వామీజీ మహిమాన్వితుడు... అద్భుతమైన అతీతమైన శక్తులెన్నిటినో తనలో నిబిడీకృతం చేసుకున్న నడిచే కలియుగదేవుడు!

భగవాన్ శక్తి సామర్థ్యాల ముందు ఈ పిచ్చివాడు ఒక పిపీలికమే... కానీ? ఏం జరిగింది?

ఆనందరావు నమ్మకానికి, అటూ ఇటూ.. సత్యాసత్యాల విచికిత్స... విచ్చుకున్న కొత్త ఆలోచన...కొత్త వివేచన.. కొత్త వెలుగు! మరోవైపు!

మిత్రుడు రాఘవ ముఖంలోకి సూటిగా చూడలేనట్లు " పదరా ! బయటికి వెళ్దాం!" అన్నాడు ఆనందరావు.

❀ ❀ ❀ ❀ ❀ ❀

(త్రైమాసిక పత్రిక "సాహిత్య నేత్రం", ప్రత్యేక బహుమతి, జూలై - సెప్టెంబరు - 2007)